క్లుప్తంగా

నేడు రంజాన్

ఆత్మకూరు: ముస్లింలు సోమవారం రంజాన్ వేడుకలను జరుపుకోనున్నారు. ఇప్పటికే ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. పట్టణంలోని కొత్తపేట, మక్కా మసీదులను సుందరంగా తీర్చిదిద్దారు. నెలరోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు ఆదివారం నెలవంక కనిపించడంతో దీక్షను విరమించారు. సోమవారం పండగ జరుపుకునేందుకు ఏర్పాటు చేశారు.

సెలవు రోజుల్లోనూ బిల్లులు చెల్లించవచ్చు

ఆత్మకూరు: ఉగాది, రంజాన్ సెలవు దినాల్లోనూ విద్యుత్ బిల్లుల కేంద్రాలు పని చేస్తాయని విద్యుత్‌శాఖ ఉప కార్యనిర్వహణాధికారి బి.రామసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి, శ్రీశైలం, సున్నిపెంట మండలాల్లో ఈనెల 30, 31వ తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగ రోజుల్లో కూడా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచే ఉంటాయన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థ మనుగడకు తోడ్పాటునందించాలని కోరారు.

పండిత సత్కారం

శ్రీశైలంటెంపుల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో సంప్రదాయబద్ధంగా పండిత సత్కార కార్యక్రమం జరిపించారు. కార్యక్రమంలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులకు, అర్చకులకు, స్థానాచార్యులకు (అధ్యాపక), వేదపండితులకు శాలువా, నూతన పంచాంగం, కొబ్బరిబోండం తదితర వాటిని అందజేసి సంప్రదాయబద్ధంగా సత్కరించారు. అలాగే దేవస్థాన అస్థాన సిద్ధాంతి బుట్టే వీరభద్ర దైవజ్ఞను సన్మానించారు.

కన్నడ భక్తులతో మర్యాద పూర్వకంగా మెలగాలి

మహానంది: క్షేత్రానికి వచ్చే కన్నడ భక్తులతో పోలీసులు మర్యాద పూర్వకంగా మెలగాలని నంద్యాల ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ పోలీసులకు సూచించారు. ఉగాది పర్వదినం సందర్భంగా మహానందీశ్వరస్వామి దర్శనార్థం మహానందికి ఆదివారం వచ్చారు. సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి మహానంది పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ శ్రీనివాసులు రెడ్డి సిబ్బందికి విధులు కేటాయించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

జూపాడుబంగ్లా: యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని తూడిచెర్ల గ్రామంలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. పోటీల్లో 22 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. సురేష్‌బాబు, వేణుగోపాల్, సంపత్‌కుమార్, పుల్లన్నయాదవ్, కాగులశంకర్ పాల్గొన్నారు.

భూముల వేలంలో దళితులపై వివక్ష దారుణం

కొత్తపల్లి: దళితులను వేలం పాటలో పాల్గొనకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్. స్వాములు, పి.ఏసన్న, సమతా సైనిక్‌దళ్ నాయకుడు సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సింగరాజుపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ భూముల వేలం పాట నిర్వహించారన్నారు. వేలం పాటకు వెళ్లిన దళితులు నక్క జాన్, పగిడిమాని శేఖర్‌ను వేలంపాట పాడొద్దని నిర్వాహకుడు కుమ్మరి కురుమూర్తి అభ్యంతరం వ్యక్తం చేయడం దారుణమన్నారు. ఈ విషయంపై కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేసి ఫిర్యాదు చేశారు. నక్క ప్రసాద్, మారేడు బాలరాజు, నక్క బాలరాజు, దేవకుమార్ పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

పగిద్యాల: ఉగాదిని పురస్కరించుకుని మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీలను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ప్రారంభించారు. యాదవ సంఘం రాష్ట్ర డైరెక్టర్ కడయం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గౌరమ్మ తదితరులు ఉన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



శ్రీశైలంలో నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాల సందర్భంగా భక్తులను అలరించేందుకు శ్రీశైల దేవస్థానం పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదికపై విశాఖపట్నంకు చెందిన ఎం.సాయిప్రియ, బృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన చేపట్టారు. అలాగే ఆలయ పుష్కరిణి వద్ద మహబూబ్‌నగర్‌కు చెందిన సాయికృప కూచిపూడి కళాక్షేత్రం బృందం సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. శివదీక్షా శిబిరాల వేదికపై బెంగళూరుకు చెందిన డా.ఎం.మోహన్, బృందం వారి కన్నడ భక్తి సంగీత విభావరి, యాంఫీథియేటర్ వద్ద బళ్లారికి చెందిన బి.బసవరాజు, బృందం చేపట్టిన నృత్య ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది.



జూపాడుబంగ్లా: పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి



పగిద్యాల: ప్రాతకోట సుంకులాపరమేశ్వరి



పాములపాడు: నాభిశిల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఊరూరా ఉగాది వేడుకలు

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాదిని ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, యువతులు ఉపవాసంతో దేవతామూర్తులకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సింగరాజుపల్లె, కొత్తపల్లి తాండవ మల్లేశ్వరస్వామి, రామాలయంలో పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు.

- **పాములపాడు:** విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని సందర్భంగా మండల ప్రజలు పిండి వంటలు, కాయ కర్పూరాలతో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పండుగ అంటేనే గుర్తుకు వచ్చేది షడ్రుచుల ఉగాది పచ్చడి, ఊయలలు ఊగడం. పిల్లలు ఊయల లూగుతూ సంతోషంగా గడిపారు. సాయంత్రం రైతులు పురోహితుల వద్దకు వెళ్లి పంచాంగం చెప్పించుకున్నారు. మద్దూరు గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నాటక ప్రదర్శన అలరించింది.
- **పగిద్యాల:** మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పాత, కొత్త ముచ్చుమర్రి, కొత్త ఎల్లాల, వనములపాడు, ఆంజనేయనగర్, బీరవోలు, సంకిరేణిపల్లె, పగిద్యాల, కొత్త పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం.ఎస్. ఘణపురం తదితర గ్రామాల్లో ఉగాది వేడుకలు వైభవంగా సాగాయి. సుంకులా పరమేశ్వరి, జంబులా పరమేశ్వరి, ఎల్లమ్మ దేవతలకు పూజలు చేశారు.
- **నందికొట్కూరు:** విశ్వావసు నామ సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ ఏడాది ఎండ ఎక్కువగా ఉన్నా సకాలంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. రైతులకు లాభసాటి పంటల గురించి తెలియజేశారు. సుంకులమ్మ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.
- **జూపాడుబంగ్లా:** మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తంగడంచ, తర్తూరు, పారమంచాల, తూడిచెర్ల, తరిగోపుల, 80బన్నూరు, మండ్లెం తదితర గ్రామాల్లో ఉగాదిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తాటిపాడులో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి వార్లను పల్లకీలో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీసుకున్నారు. సాయంత్రం పంచాంగపఠనం నిర్వహించారు. ఈ ఏడాది ఎర్రభూముల్లో ఎర్రదాన్యానికి అనుకూలంగా ఉంటుందని అర్చకులు తెలిపారు.



కొత్తపల్లి: పంచాంగ శ్రవణం చేస్తున్న శ్రీనివాసశర్మ



జూపాడుబంగ్లా: తాటిపాడు వీరభద్రస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం



నందికొట్కూరు: సుంకులమ్మ దేవాలయం వద్ద బారులు తీరిన భక్తులు



మహానందీశుడి దంపతులకు పూజలు



అబ్బీపురంలో సుంకులమ్మకు ప్రత్యేక పూజలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఆదివారం ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. వేకువజామున కుటుంబ సభ్యులతో పిల్లలు నూతన వస్త్రాలు ధరించి ఇళ్లకు మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం గ్రామ దేవతలైన సుంకులమ్మ, సవారమ్మ, పోలేరమ్మ, ఎల్లమ్మ తదితర దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ అంబాభవానీ, వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి, శివాలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం వినిపించారు.

వెలుగోడు: తెలుగువారి తొలి పండగ ఉగాదిని ఆదివారం మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. పురోహితులు యజ్ఞనారాయణ శర్మ సాయంత్రం రామాలయంలో పంచాంగ పఠనం చేశారు. పలువురు రైతులు ఎద్దులను అందంగా అలంకరించి కాడికట్టి పొలాలకు వెళ్లి సేద్యం పనులు ప్రారంభించారు.

మహానందీశ్వరుడికి తిరుమంజనం

మహానంది: ఉగాది పర్వదినం సందర్భంగా మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి దంపతులకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు స్థానిక అలంకార మండపంలో లోక కల్యాణార్థం గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఉత్సవమూర్తులకు తిరుమంజనం పూజలు చేపట్టారు. అలాగే ఆలయంలోని శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో ముఖ్య అర్చకులు రాజమాణిక్య శర్మ భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. మహానంది క్షేత్రంతో పాటు గ్రామాల్లో ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుక్కాపురం గ్రామంలో యువకులు రంగులు చల్లుకుంటూ డీజే పెట్టుకుని ఉత్సాహంగా వేడుకలు చేపట్టారు.



పంచాంగ పఠనం వినిపిస్తున్న పురోహితులు యజ్ఞ నారాయణ శర్మ



బుక్కాపురంలో రంగులతో యువకుల సంబరాలు



భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న అర్చకులు

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఆసియా మారుఫ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే ఉద్దేశం తమ పార్టీకి గానీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శిల్పా చక్రపాణి రెడ్డికి గానీ లేదని.. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చైర్‌పర్సన్‌పై ఆదరణ చూపాల్సిన అవసరం లేదని మాజీ వక్ఫ్ బోర్డ్ కమిటీ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అహమ్మద్ హుసేన్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులతో కలసి ఆయన మాట్లాడారు. చైర్‌పర్సన్‌కు, కౌన్సిలర్లకు మధ్య కొంత అవగాహన లోపం ఉన్న విషయం వాస్తవమని, అది పార్టీ అంతర్గత వ్యవహారమని, దాన్ని కుటుంబ సమస్యగా సరి చేసుకుంటామని చెప్పారు. వార్డుల్లో అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ సహకరించడం లేదని కొందరు కౌన్సిలర్లు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనని, అయితే పార్టీ నుంచి ఎన్నికల ముందు టీడీపీలోకి పోయిన కౌన్సిలర్లే తిరిగి సొంత గూటికి చేరుకున్న సందర్భంలో మా చైర్‌పర్సన్‌ను దింపే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర పరిశీలకులు సతీష్‌రెడ్డి నంద్యాలకు వచ్చినపుడు కౌన్సిలర్లు,చైర్‌పర్సన్, ఆమె తండ్రి రషీద్ పార్టీ నాయకులు ఆయన్ను కలిశారన్నారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ.. అవిశ్వాస తీర్మానం అవసరం లేదని, అంతా సర్దుకుపోవాలని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కానీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అనవసరంగా నోరు పారేసుకుంటున్నారని మండిపడ్డారు. చైర్‌పర్సన్‌పై లేనిపోని అభిమానం చూపుతూ ఆమెకు అండగా ఉంటానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కారణం లేకుండా శిల్పాచక్రపాణి రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించడం తగదన్నారు. శిల్పా హయాంలో చేసిన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తున్నా విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్,రాజమోహన్ రెడ్డి, నాయకులు బైరాపురం బాషా,రవినాయక్,తిమ్మయ్య, ధను, చాంద్ బాషా,రషీద్,ఆహమ్మద్ రసూల్,రబ్బానీ,దర్గమ్మ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అహమ్మద్ హుసేన్

శ్రీశైలం రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ చైర్మన్‌కు ఉగాది పురస్కారం..

శ్రీశైలం: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా బ్రాంచ్ కార్యవర్గ సభ్యుడు శ్రీశైలం సబ్ బ్రాంచ్ చైర్మన్ నాగశేషయ్య ఆదివారం ఉగాది పురస్కారం అందుకున్నారు. నంద్యాలలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోనున్న పీజీఆర్ఎస్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నాగశేషయ్యకు మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్థన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జేసీ విష్ణు చరణ్ పురస్కారాన్ని అందజేశారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి, వైస్ చైర్మన్ మారుతి కుమార్, కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ బాషా పాల్గొన్నారు.



కలెక్టర్, జేసీ నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న నాగ శేషయ్య



ఆలయ ప్రాంగణంలో కన్నడ భక్తుల రద్దీ

కన్నడిగులతో మహానంది కిటకిట

మహానంది: ఉగాది పర్వదినం సందర్భంగా మహానంది ఆలయం కన్నడ భక్తులతో కిటకిటలాడుతోంది. ఉగాది పండుగ, ఆదివారం సెలవురోజు ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీశైలంలో జరిగిన రథోత్సవం అనంతరం కన్నడిగులు మహానంది ఆలయానికి చేరుకుంటున్నారు. ఆలయ ప్రాంగణాలు కన్నడ భక్తజనంతో సందడిగా కనిపిస్తున్నాయి. కన్నడ భక్తుల ఆచార, సంప్రదాయాల్లో భాగంగా ఆడపడుచుల కోసం చాటలు, బావమరుదల కోసం పట్టుడు కర్రలు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓ మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, దేవిక, ఇన్‌స్పెక్టర్లు నాగమల్లయ్య, సుబ్బారెడ్డి, ఏఈ శ్రీనివాసులు యాదవ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



చాటలు, కర్రలు కొనుగోలు చేస్తున్న కన్నడిగులు

ప్రాతకోటలో బోనాల సందడి



ప్రాతకోట గ్రామంలో బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు





కాడెద్దుల ప్రదర్శన చేస్తున్న రైతులు, అమ్మవారికి పంచలోహ విగ్రహం తొడుగును సమర్పించిన భక్తుడు

పగిద్యాల: మండలంలోని పడమర ప్రాతకోటలో ఆదివారం సాయంత్రం గంగపుత్ర మహిళలు సుంకులా పరమేశ్వరికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

తప్పెట్లు, తుల్జాభవానీ డ్రమ్స్ వాయిద్యాలతో ర్యాలీగా వెళ్లారు. అలాగే రైతులు కాడెద్దుల ప్రదర్శన చేపట్టి ఉగాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

సుంకులమ్మకు పంచలోహ విగ్రహం వితరణ

మండలంలోని ఎస్. ఘణపురం గ్రామానికి చెందిన గొల్ల తిరుపాలు సుంకులమ్మకు రూ.30 వేలు విలువ చేసే పంచలోహంతో తయారు చేసిన విగ్రహం తొడుగును వితరణగా అందజేశారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని పల్లకీలో గ్రామంలో ఊరేగించి గ్రామ శివారులోని ఆలయానికి చేరుకుని సమర్పించారు.

మద్యం పట్టివేత

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మేకల బండ వద్ద ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో తాత్కాలికంగా సెల్ చార్జింగ్ షాప్ నడుపుతున్న గుంపిని మనోజ్ కుమార్ నుంచి ఆదివారం సాయంత్రం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. అతని వద్ద నుంచి మ్యాగ్డోలు విస్కీ, బాటిళ్లు, కేరళ మాల్టెడ్ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

బండి ఆత్మకూరు : యర్రగుంట్ల వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండి ఆత్మకూరుకు చెందిన ముగ్గురు యువకులు ఒకే మోటార్ సైకిల్‌పై పాల కోసం యర్రగుంట్ల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆగివున్న జేసీబీని ఢీ కొట్టారు. ఈ ఘటనలో సద్దాం, తౌఫిక్ , సయ్యద్ గాయపడ్డారు.

గ్రామ రెవెన్యూ కార్యదర్శి మృతి

ఆత్మకూరురూరల్: మండలంలోని కొట్టాల చెర్వు గ్రామ రెవెన్యూ కార్యదర్శి సాయిబాబా (61) ఆదివారం అనారోగ్య కారణాలతో మృతి చెందాడు.వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామానికి చెందిన సాయిబాబా మరణంపై ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట బస్టాండ్ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం శ్రీశైలం మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త వెంకటేశ్వరరావు,చల్లా కిశోర్,రాచమడుగు మహేష్ తదితరులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులకు మంచి నీటిని అందించారు.

ప్రజారోగ్యంపై అధికంగా వెచ్చించాల్సి ఉంటుంది

- పాపాధిక్యం ఎక్కువగా ఉంది
- మహానందిలో పంచాంగ శ్రవణంలో రవిశంకర అవధాని

మహానంది: ప్రజారోగ్యం మీద ఈ ఏడాది ప్రభుత్వం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని మహానంది దేవస్థానం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా మహానందిలో ఆదివారం ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించారు. అవధాని మాట్లాడుతూ రాజాది నవ నాయకుల్లో శుభులు ముగ్గురు ఉండగా పాపులు ఆరుగురు ఉండటంతో పాపాధిక్యం ఎక్కువగా ఉంటుందన్నారు. రాజు సూర్యుడు, మంత్రి చంద్రుడు ఉండటంతో సామాన్య ఫలాలు ఉంటాయని చెప్పారు. 2026లో రెండు పర్యాయాలు చంద్రగ్రహణం వస్తుందని చెప్పారు. ఏప్రిల్, జులై, డిసెంబర్ మాసాల్లో మూడు సార్లు చాతుర్‌గ్రహ కూటమి ఉండటం అరిష్టమన్నారు. ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, హనుమంతుశర్మ, పాల్గొన్నారు. సీఐ శ్రీనివాసులురెడ్డి, మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి పంచాంగ శ్రవణం పూజల్లో పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితులు